పెద్దపల్లి రూరల్, అక్టోబరు 7: మండ లంలోని పలు గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యు లు రెండు రోజులుగా పర్యటిస్తున్నారు. రెండు రోజుల క్రితం నిట్టూరు గ్రామాన్ని సందర్శించ గా సోమవారం రాగినేడు, మూలసాల గ్రామా ల్లో పర్యటించారు. గ్రామాల్లో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, పెన్షన్‌లు, గ్రామపంచాయతీల్లో రికా ర్డులు, కేంద్రప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి కింద అమలు చేసిన పథకాలు, ఉపాధిహామీ పథకంపై గ్రామాల్లో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. రెండు, మూడేళ్లుగా అమలు చేసిన పథకాలు, అభివృద్ధిలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్డు, మురికికాలువలు, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎలాంటి పథకాలు అమలు అవుతున్నాయో అనే విషయాలపై గ్రామ ప్రజలతో మాట్లాడి ఆరా తీశారు. రికార్డులకు అనుగుణంగా పనులు నిర్వహించారా లేదా.. చేపట్టిన ప్రాంతాలకు వెళ్లి తమ కెమెరాల్లో ఫొటోలు తీసుకున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు అందించిన పనిది నాలు, గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు వంటివి పరిశీలించారు. అనంత రం గ్రామపంచాయతీల్లో రికార్డులను పరిశీ లించి గ్రామ ఓటర్లు, కులాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న సభ్యులు బాల మురళి, సునీల్‌కు గ్రామస్థులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. వారి వెంట పెద్దపల్లి ఎంపీడీవో ఘనుకోటి శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్‌బాబు, ఈజీఎస్ జేఈ రాజయ్య, పంచాయతీ కార్యదర్శులు సంతోష్‌రెడ్డి, వెంకన్న నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 7 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలను సోమవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www. satavahana.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద

జగిత్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడం సోమవారం కొనసాగింది. ప్రస్తుతం ఎస్సారెస్పీలోకి 28,220 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 28,220 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

గన్నేరువరం, అక్టోబరు 7 : బతుకమ్మ పండుగ కోసం గునుగు పూలకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలోపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గన్నేరువరం మండలంలోని జంగపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. జంగపల్లి గ్రామానికి చెందిన గుంటుక కాళిదాసు(50)ఆదివారం ఉదయం బతుకమ్మకు వాడే గునుగు పూలను తీసుకొస్తానని భార్య లక్ష్మికి చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రం వరకూ తన భర్త ఇంటికి తిరిగి రాక పోవడంతో భార్య గ్రామస్థులను, బంధువులను విచారించింది. ఎవరిని అడిగినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన గుంటుక నారాయణ మూర్తి వ్యవసాయ బావిలో మృతదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. తన భర్త గునుగుపూలను కోసే క్రమంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. పండుగపూట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెట్టుకు ఢీ కొని యువకుడి మృతి

ఎండపల్లి, అక్టోబరు 7 : మండలంలోని గుళ్ళకోట గ్రామంలో స్నేహితుడిని ఇంటి వద్ద దించి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం చెట్టు కు ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు సోమవారం మృతి చెందాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ కథనం మేరకు.. పెద్దపల్లి జిల్లా గొరెడ్డిపేట గ్రామానికి చెందిన కాసర్ల సాయికుమార్ (22) ఆదివారం రాత్రి తన స్నేహితుడు పాలకుర్తి సాగర్‌ను గుళ్లకోట గ్రామంలోని ఇంటి వద్ద దించి తిరుగుపయనమయ్యాడు. ఈ క్రమంలో గుళ్లకోటలోని ఐకేపీ కేంద్రం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికుమార్ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకతీయ ఉపకాలువలో పడి..

శంకరపట్నం, అక్టోబరు 7: పాడి ఆవుకు పచ్చిగడ్డి కోసం వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన లింగాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి వీరయ్య (50) ఆదివారం సాయంత్రం 4గంటలకు ఆవుకు గడ్డి కోసుకు వస్తానని తన భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి 7గంటలు దాటిన ఇంటికి తిరిగి రాకపోవడంతో తన భర్తకు ఫోన్‌చేయగా, ఫోన్ స్విచాఫ్ రావడంతో వెంటనే తన కుమారులు జగదీష్, అంజి ఇతరులు కలిసి చుట్టు పక్కల గ్రామ శివారులో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం స్థానికులు కాకతీయ ఉప కాలువలో పడి ఉన్నాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా వీరయ్య కాకతీయ ఉపకాలువలో చెత్తకు తట్టుకొని బోర్లాపడి ఉన్నాడు. వీరయ్య ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని భార్య చల్లూరి రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

ఒడ్డు పైనుంచి పడి రైతు ..



ఉప్పలయ్య(ఫైల్)

ముస్తాబాద్, అక్టోబరు 7 : మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్ద ఒడ్డు పైనుంచి కాలు జారి కింద పడి మరణించాడు. ఎస్సై సీహెచ్ గణేశ్ వివరాల ప్రకారం.. మండలంలోని నామాపూర్‌కు చెందిన తాడెపు ఉప్పలయ్య(60) అనే రైతు పొలం వద్ద కరెంటు బంద్‌చేసి వద్దామని ఆదివారం సాయంత్రం వెళ్లాడు. ఒడ్డు మీద నుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయి చనిపోయాడు. ఉప్పలయ్య తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూశారు. ఉప్పలయ్యకు దాదాపు రూ.10 లక్షల అప్పు ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరా రు. ఉప్పలయ్యకు భార్య సత్తవ్వ, కొడుకు శేఖర్ ఉన్నారు. కొడుకు శేఖర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో..



అంజయ్య(ఫైల్)

పెగడపల్లి, అక్టోబరు 7: పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన బొమ్మెళ్ల అంజయ్య (53) అనే రైతు సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్థులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంజయ్య తన పంట పొలానికి కరెంట్ మోటారు ద్వారా నీరు పెట్టేందు కని సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లాడు. మోటారు స్టార్ట్ చేసి పైపును ముట్టుకోవడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడి కక్కడే మృతి చెందాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోయే సరికి అతని సోదరి సమీప పొలం యజమానికి ఫోన్ చేయగా వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి సోదరి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు. మృతుడి భార్య గతంలోనే చనిపోగా ఇంటర్ చదువుతున్న ఒక కూతురు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వీర్నపల్లి, అక్టోబరు 7 : తాళంవేసి ఉన్న ఇంటి తాళం పగుల గొట్టి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్లలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్లాగౌడ్ వివరాల ప్రకారం.. మద్దిమల్లకు చెందిన మాజోజు సత్తయ్య ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లిలో నివాసముంటున్న కుమారుడు ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి సోమవారం సాయంత్రం మద్దిమల్లకు వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా లోని 20 తులాల వెండి గొలుసులు, తులం బంగారం, రూ.20 వేల నగదు చోరీ జరిగి నట్లు గుర్తించాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై ఎల్లాగౌడ్ పరిశీలించారు. ఈ ఘటనపై సోమవారం రాత్రి బాధితుడు సత్తయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఐదుగురిపై కేసు

నెన్నెల, అక్టోబరు 7: ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని తప్పుడు అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చి మహిళను మోసం చేసిన ఐదుగురిపై మంచిర్యాల జిల్లా నెన్నెల పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బూరం స్వర్ణలతకు విద్యాంజలి పథకంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నెన్నెలకు చెందిన బాపు నమ్మబలికాడు. రూ.1.36 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. మందమర్రికి చెందిన శ్రీనివాస్, గోదావరిఖనికి చెందిన తిరుమల, పెద్దపల్లికి చెందిన పిడుగు రవీందర్ పథకం ప్రకారం తప్పుడు అపాయింట్‌మెంట్ ఆర్డర్ సృష్టించి స్వర్ణలతకు చూయించారు. అది నిజమని నమ్మిన స్వర్ణలత తన బంగారాన్ని కుదువపెట్టి వారికి జూలై 1న డబ్బులు ఇచ్చి ఆర్డర్ తీసుకున్నది. ప్రభుత్వం నూతన పథకం ప్రవేశపెట్టిందని, డీఈవో నుంచి అనుమతి తెస్తామని చెప్పడంతో హెచ్ఎం జాయిన్ చేసుకున్నారు. స్వర్ణలత అటెండర్‌గా 40 రోజుల పాటు డ్యూటీ చేసింది. జీతం ఇవ్వాలని హెచ్ఎంను కోరగా డీఈవో పర్మిషన్ లేదని, వస్తేనే వేతనం చెల్లించడం సాధ్యమని చెప్పారు. అనుమానం వచ్చి లెటర్ ఇచ్చిన వ్యక్తులను నిలదీయగా రూ.1.36 లక్షల చెక్కు తిరిగి రాసిచ్చారు. ఆ చెక్కును బ్యాంకుకు తీసుకెలితే బౌన్స్ అయింది. తను మోసపోయానని గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన నలుగురితో, తప్పుడు ఆర్డర్‌ను గుర్తించకుండా 40రోజులు పని చేయించుకున్న హెచ్ఎంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ అన్నారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రోత్సవాలు

- స్కందమాత రూపంలో అమ్మవారి దర్శనం
- నంది వాహనంపై రామలింగేశ్వర స్వామి సేవ ఊరేగింపు



ధర్మపురిలో

ధర్మపురి, అక్టోబరు 7: ధర్మపురి రామ లింగేశ్వర స్వామి ఆలయంలో దేవి నవరాత్రోత్సవాలు ఐదవ రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారలు పసుపు రంగు చీరెలో మల్లె పూలు, బిల్వ పత్రి దండలు ధరించి స్కందమాత రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. భక్తులు అమ్మవారలను దర్శించుకున్నారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్థానిక మహిళచే కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయాల్లో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణ దారు పాలెపు ప్రవీణ్‌శర్మ, మంత్రోచ్ఛరణల మధ్య మహా రుద్రాభిషేకం జరిపారు. సాయంత్రం రామలింగేశ్వర స్వామి వారల సేవలు నంది వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. టీటీడీ కళ్యాణ మండపంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెం డెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.



నంది వాహనంపై శ్రీ రామలింగేశ్వ స్వామి వారల సేవలు ఊరేగింపు

వేములవాడలో..



వేములవాడ కల్చరల్, అక్టోబరు 7 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరా జేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరా త్రోత్సవాలు కన్నుల పండగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారు స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం కావడంతో రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు స్కందమాత అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని తరించారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 7 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విన్నపాలు వెల్లువెత్తాయి. సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి జనం రావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజావాణిలో 82 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ మండలం గూడెం , కొండాపూర్ గ్రామాల శివారులోని సర్వే నంబర్ 456లో ఉన్న 19 గుంటల పట్టాభూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ బోప్ప శ్రీనివాస్ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

● కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 2 శాతం ఉన్నటువంటి అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ ద్వారా 10 శాతం రిజర్వేషన్‌లు కేటాయించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ప్రజాసంఘాల అధ్వర్యంలో సోమవారం నాయకులు కలెక్టర్‌ను కలిసివినతి పత్రాన్ని అందజేశారు. లంబాడ ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి నరేష్ నాయక్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంగూరి రంజిత్, అంబేద్కర్ సంఘం నాయకులు ఉన్నారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



కుంకుమ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, నారాయణపూర్, దుమాల, వెంకటాపూర్, తదితర గ్రామాల్లో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, దుమాల తదితర గ్రామాల్లోని దుర్గా మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారు మహాచండీ దేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకుని దేవీని దర్శించుకున్నారు. ఏఎంసీ పాలక వర్గం సభ్యులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండలపాల వద్ద సోమవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సక్కపేటలో కుంకుమపూజలు, అన్నదానం చేపట్టారు. ఇల్లంతకుంటలోని హిందువాహిణీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని న్యూ హనుమాన్ నగర్‌లో యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గా మాత వద్ద సోమవారం సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో లయన్స్ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గచ్చుబావి వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో సోమవారం మహిళలు ఘనంగా కుంకుమ పూజలు చేశారు.

కోనరావుపేట: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన దుర్గమాత సోమవారం లలితాదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత మండపాల్లో కుంకుమ పూజలు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్సై, నాయకులు

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



భక్తులతో కోలాహలంగా రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 7: వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పలు విభాగాలను తనిఖీ చేశారు. రాజన్న ఆలయంలోని లడ్డూ కౌంటర్, ప్రోటోకాల్ కార్యాలయం, క్యూలైన్‌లు, కోడెమొక్కు బుకింగ్ కౌంటర్‌ను, ఆయా విభాగాల్లోని రికార్డులను పరిశీలించారు. సంబంధిత అధికారులు పలు సూచనలు చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వారి వెంట సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్, ప్రోటోకాల్ ఇన్‌చార్జి ఎడ్ల శివసాయి ఉన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

WANTED YOUNGSTURES

WAITERS, LADY RECEPTIONISTS WANTED FOR WELLNOTED RESTUARENT NEAR KAMAN, KARIMNAGAR. GOOD SALARY, FREE MEALS, ACCOMMODATION, CELL: 91584 84333

AJK-15998

ప్యాంట్ మేకర్స్ కావలెను

జగిత్యాలలోని అతిపెద్ద మెగా సిటిమెన్ టేలర్‌లో ప్యాంట్లు కుట్టడానికి నైపుణ్యంగల ప్యాంటు మేకర్లు కావలెను. సంప్రదించండి: 98493 46271

AJK-201595

CHANGE OF NAME

★ I DOOSA SRUJANKUMAR S/O DOOSA MALLESHAM, H.NO: 3-55, MUTHYAMPET, MANDAL : MALLIAL, KARIMNAGAR, (T.G), HAVE CHANGED MY NAME AS DUSA SRUJAN KUMAR S/O. MALLESHAM

AJK-201597

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640

జగిత్యాల :- సెల్ : 99854 11262

మెట్‌పల్లి :- సెల్ : 70131 42966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238

అన్నదాతల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7: గ్రామాల్లో వరి కోతలు చేపడుతున్న నేపథ్యంలో మార్కెటు కమిటీ సభ్యులు అన్నదాతలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంగౌస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది పసుల కృష్ణ ఆధ్వర్యంలో పాలక వర్గం సభ్యులను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా నర్సయ్య, సబేరాబేగంగౌస్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లోనే విక్రయించేలా చూడాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ చెల్లించనుందన్నారు. వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు రాజేందర్, తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, చిన్నలక్ష్మీబుచ్చాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రవీందర్, నారాయణరెడ్డి, బాలయ్య, గణపతి, సత్యంరెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంగౌస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు పదిర, నారాయణపూర్, బొప్పాపూర్, హరిదాసనగర్, దుమాల, బండలింగంపల్లి తదితర గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఆపదలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, లక్ష్మీబుచ్చాగౌడ్, మహేందర్, శ్రీనివాస్, రాజు, పర్శరాములు, మల్లారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులపై నిరసన

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 7 : పాలస్తీనా, గాజాపై అమెరికా అండతో ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ సోమవారం సీపీఐ, సీపీఐ(ఎంఎల్)సంయుక్త ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, సీపీఐ(ఎంఎల్)జిల్లా కార్యదర్శి సోమిశెట్టి దశరథం మాట్లాడారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ యుద్ధం ప్రకటించిందన్నారు. ఐక్యరాజ్య సమితి యుద్ధం ఆపాలని తీర్మానం చేసినా కొనసాగించడం బాధాకరమన్నారు. సహజ సంపదను దోచుకోవడం కోసం చిన్న దేశాలపై అమెరికా దాడులు చేయిస్తోందన్నారు. కమ్యూనిస్టు, వామ పక్ష పార్టీలు ప్రపంచ శాంతిని కోరుకుంటున్నా యన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రపంచ శాంతిని కోరుకొని యుద్ధం ఆపడానికి కృషి చేయాలని కోరారు. సీపీఐ నాయకులు గాజుల లింగం, మంత్రి చంద్రయ్య, అజ్జ వేణు, ఎర్రజెండా పవర్‌లూం కార్మిక సంఘం నాయకులు ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7: విశ్రాంత ఉపాధ్యాయుడు రేణికింది జనార్దన్ (65) కరీంనగర్‌లో మృతి చెందగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పూర్వ విద్యార్థులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనార్దన్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. 20 ఏళ్ల పాటు మండల కేంద్రంలో ఇంటిని అద్దెకు తీసుకుని పాఠాలు బోధించారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఐదు రోజుల కిందట జనార్దన్ సతీమణి సులోచన అనారోగ్యంతో చనిపోయారు. అప్పటికే అనారోగ్యం బారిన పడిన జనార్దన్ భార్య మృతిని

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 7: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంలో మూడు రోజులు నిర్వహించే జిల్లా పోలీస్ రెండో వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో పోలీసు ఉద్యోగుల్లో స్నేహ సంబంధాలు మెరుగు పడతాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీసుల్లో క్రీడలు నూతనోత్సాహాన్ని నింపుతాయన్నారు. జిల్లాలోని 13 పోలీస్‌స్టేషన్‌ల నుంచి 6 జట్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. అంతకుముందు క్రీడా జ్యోతి వెలిగించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ, రూరల్ సీఐ మొగిలి, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు మధుకర్, రమేశ్, ఎస్సైలు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాటన్ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 7: రాష్ట్ర ప్రభుత్వం కాటన్ మిలితంతో తయారు చేసే చీరల ఆర్డర్‌లను సిరిసిల్ల కాటన్ వస్త్ర పరిశ్రమలకు ఇవ్వాలని కాటన్ వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఐక్య వేదిక జాయింట్ కమిటీ సభ్యులు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిశారు. సిరిసిల్లలో కాటన్ వస్త్ర పరిశ్రమలపై కాటన్ మిలితంతో తయారు చేసిన చీరలను చూపించారు. ఈ సంద ర్భంగా వారు మాటాడుతూ సిరిసిల్లలో గతంలో ఎక్కువభాగం మరమగ్గాలపై కాటన్ వస్త్రాలను తయారు చేసేవారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాటన్ అనుబంధ పరిశ్రమ ఉత్పత్తిదా రులను బలవంతంగా అదుపులోకి తీసుకొని పాలిస్టర్ బతు కమ్మ చీరలను ఉత్పత్తి చేయించిందన్నారు. దీంతో కొంత కాలంగా కాటన్ అనుబంధ వస్త్ర వ్యాపారాలు నష్టాలకు గురై మూతపడ్డాయన్నారు. సైజింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడ సురేష్, కార్యదర్శి రవి, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, కార్యదర్శి గెంట్యాల గోపీ, వస్త్ర వ్యా పార సం ఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, కార్యదర్శి గౌడ రాజు, డైయింగ్ ఓనర్స్ అసోసి యేషన్ అధ్య క్షుడు చిలుక రాజేశం, కార్యదర్శి శ్రీనివాస్, కాటన్ వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అశోక్, సిరిసిల్ల డైయింగ్ అసాముల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోడం అనంద్‌బాబు పాల్గొన్నారు

రేపు టీచర్ అభ్యర్థులకు నియామక పత్రాలు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 7: డీఎస్సీ పరీక్షల ద్వారా ఎంపికైన టీచర్ అభ్యర్థులు అక్టోబరు 9న హైదరాబాదులో జరిగే నియామక పత్రాల పంపిణీకి హాజరయ్యేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న 140 టీచర్ పోస్టులను డీఎస్సీ పరీక్షల ద్వారా ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ ఉంటుందన్నారు. వేములవాడ నుంచి ఒక బస్సు, సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి రెండు బస్సులు అభ్యర్థులతో బయల్దేరాలన్నారు. ప్రతీ బస్సుకు ఒక లైసెన్ అధికారిని నియమించాలని, అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈవో రమేష్, డీఎంఅండ్‌హెచ్‌వో వసంతరావు, డీసీఎస్‌వో వసంతలక్ష్మీ, వేములవాడ, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం

ముస్తాబాద్, అక్టోబరు 7: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు రూ.11 లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. పేదలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెల్మల రాంరెడ్డి, తలారి నర్సయ్య, గాంత రాజు, కుమార్, కొండయ్య, భాను, తుపాకుల శ్రీనివాస్, బుచ్చయ్య, మిరుదొడ్డి భాను, గోవర్ధన్‌నాయక్, తాళ్ల విజయ్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, బద్దిపడిగె అనిల్‌రెడ్డి, నల్ల బాలెల్లు, బాలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

తంగళ్లపల్లి, అక్టోబరు 7: నూలు డిపో మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరావ్, పొన్నం ప్రభాకర్ గౌడ్, విప్ ఆది శ్రీనివాస్, పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. నూలు డిపో ఏర్పాటుతో మరమగ్గాల పరిశ్రమలో నేతన్నలకు పెట్టుబడిదారులపై ఆధారపడకుండా నేరుగా ఉపాధి లభిస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు జల్లం ప్రవీణ్, పెద్దూరి తిరుపతి, మోర రాజు, నేరెళ్ల నర్సింగం, మచ్చ శ్రీనివాస్, రాపెల్లి ఆనందం, మోర లక్ష్మీరాజం, మునిగెల రాజు, గడ్డం మధుకర్, మీరాల శ్రీనివాస్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్. ఎగుర్ల ప్రశాంత్, హరిక రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వీడాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7: గ్రామాల్లో ప్రజలకు శుద్ధ నీటి సరఫరాలో నీటి సహాయకులు నిర్లక్ష్యం వీడాలని మిషన్ భగీరథ ఈఈ జానకి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని నీటి సహాయకులను నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఈఈ జానకి మాట్లాడుతూ నిత్యం నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. ఎంపీడీవోలు సత్తయ్య, రఘురాం, ఏఈలు సంతోష్, అనిల్, నీటి సహాయకులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 7 : వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి గ్రామ పరిధిలోని శంకర్ నాయక్ తండాకు జీడీ రోడ్డు నుంచి మంజూరైన బీటీ రోడ్డు పనులను ప్రారంభించాలని గ్రామస్థులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎస్టీ నిధుల ద్వారా జడ్పీ రోడ్డు నుంచి శంకర్ నాయక్ తండా వరకు నాలుగు కిలోమీటర్‌ల బీటీ రోడ్డు మంజూరైందని, దీనికి రూ. 3.70 కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. భూక్య తిరుపతి, భూక్య రవి, భూక్య మహేందర్, సురేష్, మాలోత్ తిరుపతి పాల్గొన్నారు.

యువత క్రీడల పై దృష్టి సారించాలి

చందుర్తి అక్టోబరు 7: గ్రామీణ ప్రాంతంలోని యువత క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం ముడపల్లి గ్రామంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రికెట్ టీం సభ్యులకు టీ షర్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాకల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలు



కోర్టులో జిల్లా జడ్జి ప్రేమలత, న్యాయవాదులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 7: సిరిసిల్ల పట్టణ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అంతకు ముందు రెడ్డి సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో సిరిసిల్ల ఏఎంసీ చైర్ పర్సన్ వెల్మల స్వరూప తిరుపతిరెడ్డిని సన్మానించారు. అనంతరం సిరిసిల్ల పట్టణం లక్ష్మీవేంకటేశ్వర దేవాలయం ఎదుట బతుకమ్మ సంబరాలను నిర్వహించుకున్నారు. స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద మానేరులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. రెడ్డి మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు నేవూరి మమత, ఉపాధ్యక్షురాలు మడుపు ప్రమోద, సంయుక్త కార్యదర్శి దుంద్ర జలజ, వైద్యురాలు దోర్నాల జ్యోతి, సంఘం పట్టణ అధ్యక్షుడు మడుపు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాతూరి సంజీవరెడ్డి, కోశాధికారి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వీచు మల్లారెడ్డి, నూనే శ్రీనివాస్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు చల్ల సువర్ణ పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కోర్టు ఆవరణలో మహిళా న్యాయమూర్తులు, మహిళా న్యాయవాదులు బతుకమ్మ ఆడారు. అనంతరం మానేరువాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, సీనియర్ సివిల్‌జడ్జి రాధిక జైస్వాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, క్రీడలు, కల్చరల్ సెక్రెటరీ గుడ్ల కిషన్ పాల్గొన్నారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు సోమవారం ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

సీఏపై పోలీసులకు ఫిర్యాదు

తంగళ్లపల్లి, అక్టోబరు 7: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో సీఏపై మహిళా సంఘాల సభ్యులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత మహిళల కథనం ప్రకారం... ఇందిరమ్మకాలనీలో 22 మహిళా గ్రూపులు ఉండగా అందులో 8 సంఘాల్లోని సభ్యుల నుంచి సీఏగా వ్యవహరిస్తున్న అన్నల్‌దాస్ కళ్యాణి డబ్బులు తీసుకుంది. మహిళల నుంచి సుమారు రూ.18 లక్షల వరకు వసూలు చేసింది. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లిస్తుందని సభ్యులు భావించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల నుంచి కళ్యాణి కనబడకుండా పోయింది. దీంతో మహిళలు కళ్యాణిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.